# ప్రేమ రామాయణం!

'పోలీసోళ్ళలో కూడా ప్రేమ వివాహాలుంటయ్ అంటే నమ్మశక్యం కాదు...' ఓ స్టేట్‌మెంట్ పారేశాడు పార్వతీశం.

'ఎందుకనీ' ఎదురు ప్రశ్న వేశాడు గోవిందరావ్.

'అంత అమాయకంగ ఏమీ తెలీనివాడిలా ముఖం పెట్టకు! ఒక విషయం చెప్పనా?... అసలు లవ్ మేరేజ్‌స్ అనేవి సెంట్ పర్సెంట్ సక్సెసైన దాఖల్లాల్లేవ్! ఎప్పుడూ కొట్టుకు చావటమో... నాన్ కోఆపరేషనో... ఈగో ప్రాబ్లమో... వారిని నీడలా వెంటాడి వేధిస్తూంటుంది. ఇద్దరూ వుద్యోగాలు చేసేవారి సంగతి చెప్పక్కర్లేదనుకో. ఎవరిజీతం నెలనెలా ఎవరి వద్ద వుంచాలి? ఎవరు ఖర్చు వారే చేయాలి? అనే అంశాలతో ఒకరిపై మరొకరు రుసరుసలాడుతూ ఎప్పుడూ కారాలు మిరియాలు నూరుతూ... అశాంతితో కాపురాలు వెలగబెట్టటం అనేకం చూస్తున్నాం!...'

'సోది ఆపి పాయింట్‌కురా!... నేనడిగేది పోలీసోళ్ళ లవ్ మేరేజెస్ గురించి... అదేదో చెప్పేడు'

'వస్తున్నా... వస్తున్నా!... నీ పాయింట్‌కే వస్తున్నా!- పోలీసోళ్ళు బహు అనుమానస్తులు! తాళికట్టిన భార్యని కడుపున పుట్టిన పిల్లలనీ అనుమానించే గుణం వాళ్ళది! అది వ్యక్తుల తప్పుకాదు. వారికి ఇచ్చే ట్రైనింగ్‌లో ఓభాగం!...' అందరినీ అనుమానించటం వారి హక్కు!!

'అంటే...?'

'ఎవరినీ నమ్మకు అనేది డిపార్ట్‌మెంట్ స్లోగన్! దీనికి విరుద్ధంగ వ్యక్తిగత జీవితాల్లో కూడా అనుమానం పెద్దమ్మ వారి నెత్తినెక్కి ప్రతిక్షణం నాట్యం చేస్తూంటుంది! అందుచేత...'

'అర్థమైంది! సినిమాల్లో... టి.వి. సీరియల్స్‌లో చూస్తున్నట్టు... ఎక్కడ భోజనంలో విషం కలుపుతుందోని భార్యని అనుమానించి లాఠీతో చావబాదటం... పిల్లలను అనుక్షణం చెండుకు తినటం...లాంటి వన్నమాట!...'

'అమ్మయ్య! ఇప్పుడు దారిలో కొచ్చావ్! నీకో పోలీసోళ్ళ ప్రేమకథ చెప్తాను... గుడిలో హరికథ చెప్తూంటే ఆలకించినట్టు భక్తి శ్రద్ధలతో విను! మా పక్క వాటాలో కొత్తగ పెళ్ళి చేసుకున్న జంట అద్దెకు దిగింది!... వారి ప్రేమ రామాయణ కథా క్రమంబు ఎట్టిదనిన...'

టీ.కా. తాత్పర్యంతో సహా పూసగుచ్చినట్టు చెప్పటం మొదలుపెట్టాడు పార్వతీశం.

★ ★ ★ ★ ★

కొత్తగ జాబ్‌లో జాయినవటానికి వచ్చింది లగాయితు శేషారత్నానికి సైటు కొడుతూనే వున్నాడు కాంతారావ్.

ఆడపిల్ల అయినా ధైర్య సాహసాలున్న పిల్ల శేషారత్నం. బి.ఎ. పాసైనాక మంచి జాబ్ ఎంతకీ దొరక్క పోవటంతో పోలీస్ వుద్యోగం మాత్రమైతేనేం? అనుకుని అప్లై చేసింది. సెలక్టయి... ట్రెనింగ్ కంప్లీట్ చేసి పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకుని పోలీస్టేషన్లోకి ఎంటరైంది.

'ఏంటి? సినిమా హీరోయిన్‌లాగ షోకు చేసుకుని తిప్పుకుంటూ వచ్చావ్? నువ్వొచ్చింది జాబ్‌లో జాయినయేటందుకా... ఫ్యాషన్ పెరేడ్‌లో పార్టిసిపేట్ చేసేటందుకా?-' మీసం దువ్వుతూ గఁయ్‌మన్నాడు ఎస్సై కాంతారావ్.

కాంతారావ్ అంటే తెలీనివారుండరు. డైరెక్ట్ ఎస్సై పోస్ట్‌కి సెలక్టయిన యంగ్ అండ్ డైనమిక్ హీరో! అసలు ఐ.పి.ఎస్. పాసై డైరెక్ట్ ఎస్పీ కావలసినోడు. బేడ్‌లక్ మినిస్టర్ మామ పాచిక పారలేదు. రికమెండేషన్ చాల్లేదు. ఆ కారణంగ కాంతారావ్ ఎగ్జామ్స్‌లో పల్టీ కొట్టాడు.

రుసరుసలాడుతూ తాను ఫెయిలైనందుకు పిల్లిమొగ్గలేసి మేనమామ ముందు తన నిరసన తెలీచేశాడు.

ఇక లాభంలేదనుకున్న మినిస్టర్ మేనమామ తన పలుకుబడినంతా వుపయోగించి... మొత్తానికి ఎగ్జామ్స్ పాస్ చేయించి ఎస్సై సెలక్షన్ ఇప్పించి... ట్రెనింగ్ పూర్తికాగానే తనకు అందుబాటులో వుంటాడు కదాని సిటీలో పోస్టింగ్ ఇప్పించాడు.

ఎస్సై కాంతారావ్ ప్రశ్నలకు శేషారత్నం బిత్తరపోయింది. నోట మాట కరువైంది.

'నీకు యూనిఫారం లేదా?-'

'పాతవి చిరిగిపోయినయ్ సార్. కొత్తవి కుట్టమని టైలర్‌కి ఇస్తే... ఈవినింగ్ ఇస్తానన్నాడు సార్. ఉదయం పదింటికి వర్జం రాహుకాలం లేదని... తారాబలం చంద్రబలం బాగుంది కదాని... రిపోర్ట్ చెయటానికి శారీ మీదే వచ్చాను. క్షమించండి సార్...' ధైర్యాన్ని కూడదీసుకుని రిప్లై ఇచ్చింది.

'నువ్వు గడుసు దానివే! తెలివిగా సమాధానమిచ్చావ్. నువ్వు మెరిట్ కేండిడేట్‌వా?... రికమెండేషన్ మీద సెలక్షనొచ్చిందా?-'

'నోనో సార్! నేను బాక్సింగ్‌లో స్టేట్ ఫస్ట్! రన్నింగ్‌లో కంట్రీ ఫస్ట్! లాంగ్ అండ్ హైజంప్‌లో ఒలంపిక్స్ ఫస్టొచ్చిన గోల్డ్ మెడలిస్ట్‌ని సార్...'

'వామ్మో! మంచి బేగ్రౌండ్ వున్నదానివే... నువ్వింత సుకుమారంగ... అందంగ వున్నదానివి పోలీసు వుద్యోగం ఏం చేస్తావాని... నాడౌటు!-' ఆమె శారీలో దాక్కున్న ఒంపుసొంపులను... వయసు పొంగును నిశితంగా పరీక్షిస్తూ కామెంట్ చేశాడు కాంతారావ్.

ఎస్సై చెత్తచూపులు... పనికిమాలిన ప్రశ్నలు ఆమెలో చిరాకు కలిగించినయ్. వాడి పీక పిసికి చంపాలన్నంత కోపమొచ్చింది.

కానీ ఎస్సై బాస్ కాబట్టి కోపాన్ని దిగమింగి తనను తాను శాంతపరచుకుంది.

లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లాగ... శేషారత్నం నాజూకుతనాన్నీ... రూప లావణ్యాన్నీ చూచి కళ్ళతో వాటిని జుర్రుకుని పాయసంలా తాగేశాడు కాంతారావ్.

శేషారత్నం లాంటి ముద్దుగుమ్మని లవ్వాడి పెళ్ళాడాల్సిందే అనుకున్నాడు.

తాను చూద్దామంటే కానిస్టేబుల్... కాంతారావ్ ఎస్సై! బాస్‌ని ప్రేమించటం అన్ని విధాలా మంచిదన్పించింది శేషారత్నానికి కూడా!

ఆవిధంగ వారిరువురి ప్రేమ మొక్కై మానై వటవృక్షమంతై... వివాహానికి దారితీసింది.

★ ★ ★ ★ ★

తీరా పెళ్ళి అయ్యాక కానీ కాంతారావ్... అదే తన మొగుడు మహానుభావుడి నిజస్వరూపమేంటో తెల్సిరాలేదు.

ఇంట్లో కూడా తనను చెండుకు తింటున్నాడు. మనసుకి శరీరానికి సుఖం లేకపోగా మానసికంగ ఎస్సై పెట్టే హింసకు శేషారత్నం నలిగిపోవలసివస్తున్నది.

'ఫోర్నాట్ త్రీ... ఫోర్నాట్ త్రీ... ఎక్కడ చచ్చావే... రాయిటు...' బెడ్‌మీద పడుకుని కళ్ళు తెరవకుండానే పెళ్ళాన్ని పోలీసు నెంబర్‌తో గావుకేకలు పెట్టాడు.

అమ్మో! రాక్షసుడి కేకలు మొదలైనయ్... అనుకుంటూ పరుగులాంటి నడకతో మొగుడి బెడ్ దగ్గరకొచ్చి నిలబడి సెల్యూట్ చేసి 'పిలిచారా సార్' అంది.

'చారు పులుసు కాదు. ఇదంతా నేనిచ్చిన అలుసు!... అవునూ నీ యూనిఫారం కేపు ఏదీ?...' కళ్ళు తెరిచి గుడ్లురిమాడు కాంతారావ్.

దొంగ చచ్చినోడు... ఇంట్లో కూడా యూనిఫారంతో కన్పించాల్సిందే! లేకపోతే అవాకులూ చెవాకులూ పేలి లెఫ్ట్ రైట్ మార్చింగ్ చేయిస్తాడు. ఛస్తున్నాను వీడితో వేగలేక...'

'ఏంటీ నీలో నువ్వే గొణుక్కుంటున్నావ్?- నా బెడ్‌మీదున్నా సరే యూనిఫామ్‌లో నువ్ లేకపోతే సస్పెండ్ చేస్తాను. గో... గెట్ కాఫీ...'

పాచి ముఖంతో కాఫీ తాగే నిన్ను పెళ్ళి చేసుకున్నాను చూడు... నిన్ననేం లాభం? నా చెంపలు నేను వాయించుకోవాలి... గునుస్తూ కిచన్లోకెళ్ళింది.

ఓ ముద్దూలేదు. మురిపెం లేదు. పీపాలాంటి పొట్ట వీడూ... లంచాలు మెక్కటానికి... ఓ.సీ.గా సీసాలు తెప్పించుకు తాగటానికి... బకాసురుడిలా మెక్కి... కుంభకర్ణుడిలా నిద్రపోవటానికి మాత్రమే పనికొస్తాడు.

నెలజీతం లాగేసుకుంటాడు. రోజువారీ మామూళ్ళు ఏవీ అంటూ చెండుకు తింటాడు.

ఇంతకుమించి పెళ్ళాన్ని సుఖపెట్టటం తెలీని మొరటోడు. ఖర్మకాలి ఇలాంటి ఎలుగుబంటిని చేసుకున్నాను. ఏ జన్మలోనో నే చేసుకున్న మహాపాపమో ఇప్పుడిట్లా ముప్పుతిప్పలు పెడుతున్నాడు...' అనుకొని బాధపడని క్షణంలేదు.

అప్పటికీ తెగించి ఒకసారి 'మనమధ్య స్వజాతి వైరం తగదు. ప్రేమించి పెళ్ళాడిన మనిద్దరం పాము ముంగిసలా అనుక్షణం కొట్టాడుకోవటం ఏమీ బాగోలేదు...' అనేసింది.

ఆక్షణాన ఎస్పై కాంతారావ్ చేతిలో లాఠీ శేషారత్నం వంటిమీద నాట్యం చేసింది.

'నన్నిలా హింసిస్తే వూరుకోను! మీమీద కేసు పెట్టి కోర్టు కీడుస్తాను. మరీ... కీచకుడిలా బిహేవ్ చెయ్యకండి...' వార్నింగ్ ఇచ్చింది.

వామ్మో! ఇది మామూలు ఆడదికాదు. ఎస్పై మొగుడి మీదే తిరగబడుతున్నదంటే... కేసు సీరియస్సే... అన్పించింది కాంతారావ్‌కి.

'ఇదిగో చూడు ఎస్పై! నేను పి.జి. చేసి ఏదో ఒకనాటికి ఐ.పి.ఎస్. చేసి ఎస్పీ అవుతాను. అప్పుడు నీ పని ఫినిష్! నువ్ లాఠీ దెబ్బలే కొట్టావ్. నేనిన్ను బొక్కలో తోయించి ఎముకలు విరగ్గొట్టిస్తాను. నువ్వు మహా అయితే డి.ఎస్పీ అయితే గొప్ప! నేను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అవటానికి ఛాన్సుంది. అప్పుడు తీర్చుకుంటాను కసి...' పళ్ళు పటపట కొరికింది శేషారత్నం.

అటు ఇటు తిప్పి నాకే ఫిటింగ్ పెట్టిందంటే... ఇది బోల్డు తెలివిగల్దీ! దీన్ని కొంచెం దువ్వి మంచి చేసుకోవటమే మంచిది అనుకున్నాడు కాంతారావ్ మనసులో.

★ ★ ★ ★ ★

ఎస్పీ కార్యాలయంలో సీట్లో కూర్చున్న శేషారత్నం సీరియస్‌గ ఫైళ్ళు స్టడీ చేస్తూ

ఆర్డర్స్ పాస్ చేయటంలో లీనమైంది.

'మేడమ్... ఎస్పై కాంతారావ్ గారొచ్చారు. మీకోసం చాలాసేపటినుంచి వెయిట్ చేస్తున్నారు. లోనికి పంపమంటారా?...' ఇంటర్‌కమ్‌లో అడిగేడు.

'నో! లెట్ హిమ్ వెయిట్!' చిరాకు పడుతూ రిసీవర్ పెట్టేసింది.

అదేమాట పి.ఏ. కాంతారావ్‌కి చెప్పాడు.

ఎంత పొగరు దీనికి? మొగుడునని కూడా చూడకుండా... పిసరంతైనా అభిమానం చూపకుండా... వెయిట్ చేయమంటుందా? చెప్తా... చెప్తా...! దీనిపని బంగళాకొచ్చాక చెప్తా! ఆ చెంప ఈ చెంప వాయిస్తాను. గరిటెకాల్చి వాతలు పెడితేగాని దీని రోగం కుదరదు... అమ్మో! అట్లా చేస్తే తనను రివాల్వర్‌తో షూట్ చేసి పారేయదూ? ఇప్పుడు తన సబార్డినేట్ కాదు... తనే ఆమెకి సబార్డినేట్. వంగి వంగి సెల్యూట్ చేయలేక చావుకొస్తోంది...'

'సార్... మిమ్మల్ని లోపలికి రమ్మన్నారు ఎస్పీగారు...' పి.ఏ. చెప్పటంతో ఆలోచనల దొంతర్లోంచి మేలకున్న కాంతారావ్ వంటిన యూనిఫామ్... నెత్తిన టోపీ సరిచేసుకుని తలుపు తోసుకుని ఎస్పీ ఎ.సి. ఛాంబర్లోకి అడుగుపెట్టాడు.

అబ్బో! ఎంత వైభోగం దీనికి? నేనేమో ఎర్రటి ఎండలో... వానలో తడిసి ముద్దై రాత్రింబవళ్ళు డ్యూటీలు చేస్తుంటే... పెళ్ళాం దొరసాని ఎ.సి. గదిలో ఎంత హాయి అనుభవిస్తోంది... పెదాలు కదలకుండా తన్లో తాను గొణుక్కున్నాడు.

శేషారత్నం తలెత్తి చూసింది.

అటెన్షన్లో నిలబడి సెల్యూట్ చేశాడు కాంతారావ్.

కూర్చోమని కూడా అన్లేదు. ఏం ఠీవి?... ఏం రాజసం?... అదృష్టం అందలం ఎక్కించింది. సాగించుకుంటోంది...

'వచ్చి నన్ను కలవమని ఎప్పుడో కబురుపెడితే... ఇప్పుడా వచ్చేది మిస్టర్ కాంతారావ్! దీసీజ్ వెరీ బేడ్! ఐ డోంట్ లైక్ దిస్ ఇన్సబార్డినేషన్...' చురచురా చూస్తూ సీరియస్ అయింది ఎస్పీ.

నోరెత్తితే ఇంకా ఏం సాధిస్తుందోనని మౌనం వహించాడు. ఎంత పెళ్ళామైనా డ్యూటీలో వుండగా 'బాస్' కదా!?

'నిన్నీ సీట్లో చూస్తుంటే నాకెంతో ముచ్చటేస్తోంది. నిజంగా నువ్విప్పుడు ముద్దొస్తున్నావ్ శేషా...'

'షటప్! మైండ్ యువర్ లాంగ్వేజ్...' అగ్గిమీద గుగ్గిలమైంది.

'ఎస్ మేమ్....' నోటికి తాళం పడింది.

'నీమీద చాలా ఫిర్యాదులొస్తున్నయ్. లంచంరేటు పెంచేశావట!... లాండ్ సెటిల్మెంట్ కేసుల్లోనూ తలదూర్చి అడిగినంత ఇమ్మని టార్చర్ చేస్తున్నావట!... ఇలా అయితే నీ సి.ఆర్. మటాషవుతుంది. శ్రీకాకుళం బదిలీ అవుతావ్... ఇంకా దూరంగా విసిరేస్తే... అడవుల్లో గల లాండ్‌మైన్స్ బ్లాస్టై శాల్తీ గల్లంతయ్యే ప్రమాదముంది...' నిప్పుల వాన కురిపించింది.

కాంతారావ్ వంటినున్న యూనిఫామ్ చెమటతో తడిసి ముద్దైంది. పెదాలు వణుకుతున్నాయ్. మనిషిని నీరసం ఆవహించింది.

తనపక్కనే పడుకుని ఏదేదో కలవరిస్తున్న శేషారత్నాన్ని తట్టిలేపుతూ... 'ఏమిటీ కలలు కంటున్నావా?... నువ్ ఐ.పి.ఎస్. పాసై... ఎస్పీ అయినట్టు... నన్ను నోటికొచ్చినట్టు తిడుతున్నట్టు... రాచిరంపాన పెడుతున్నట్టు కలలో తెగఫీలైపోతున్నావా?- ఓసి దున్నపోతూ... లే! నిద్రలే!... బారెడు పొద్దెక్కింది. లేచి పొయ్యి వెలిగించి కాఫీ పెట్టి పట్రా... గో! రాస్కెల్...' తిట్ల పురాణం మొదలవటంతో గభాలున మేలుకున్న శేషారత్నం 'అదేంలేదు సార్! గుడ్ మార్నింగ్ సార్!...' చీరె కుచ్చిళ్ళు సర్దుకుంటూ మంచం దిగి కిచన్‌వైపు వేగంగా నడిచింది.

'ఇదిగో ఫోర్నాట్ త్రీ! అరక్షణంలో నువ్వు కాఫీ కప్పుతో నా ముందు వుండకపోయావో... లాఠీఛార్జీ గతే నీకు...' అరిచాడు ఎస్పై కాంతారావ్.

ఈ నరకం నాకెన్నాళ్ళో దేవుడా? ఐ.పి.ఎస్. ఎగ్జామ్ రాసేదెప్పుడు?... ఎస్పీ అయి నా మొగుడి భరతం పట్టేదెప్పుడు?... తనను తాను తిట్టుకుంది.

★★★★★

'అదిరా సంగతి! ఆవిధంగ... నే చెప్తున్న పోలీసు మొగుడూ పెళ్ళాల ప్రేమ రామాయణ... రోజూ ఆరు తన్నులు... పన్నెండు ఏడుపులతో ముగింపు లేని టి.వి. సీరియల్‌కు మల్లే సాగుతోంది...' అంటూ పార్వతీశం కథ చెప్పటం పూర్తి చేశాడు.

'అందుకే... ఈ రోజుల్లో మేరేజెస్ ఆర్ నాట్ మేడిన్ హెవన్ అనుకోవలసి వస్తోంది. ఎవరి ఖర్మ వారిది!...' నిట్టూర్చాడు గోవిందరావ్.

\- సమాప్తం -